# టైమ్

సి.భారతి




ఆఫీసు నుంచి వస్తూనే దిగాలుగా పడక కుర్చీలో చేరగిలబడ్డాడు రామారావు.

"ఏమి టండీ అలా ఉన్నారు ? ప్రమోషన్ లిస్టు బయటకు వచ్చిందా?" అంది ఆతురతగా సుజాత.

"మనం అనుకు న్నంత అయింది" అన్నాడు నిర్లిప్తంగా.

ఒక్క నిమిషం మాట రాలేదు సుజాతకు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రమోషన్ చేయి జారిపోయింది. అసలు పది సంవత్సరాలుగా ఆఫీసులో ప్రమోషన్‌లు ఎవరికీ ఇవ్వలేదు. ఆ కారణం చేత ఈసారి ఎక్కువ మందికి ఇస్తారని అనుకున్నారు. రామారావు పేరు మొదటి పది మందిలో ఉంది. ఏ విధంగా చూసినా అతనికి ప్రమోషన్ రాకుండా ఉండటానికి వీలు లేదు, కాని రాలేదు.

వ్యక్తిగా అతను మంచివాడు. ఆఫీసు వ ర్కంత క్షుణ్ణంగా తెలును. ఎప్పటి కప్పుడు వచ్చే మార్పులు, రూల్సు అర్థం చేసుకుని తను చేసే పని వల్ల ఎటువంటి ఇబ్బందీ రాకుండా చేసుకోగలడు. ఒక్క మాటలో చెప్పా లంటే వర్డ్స్‌వర్త్ చెప్పిన 'డ్యూటీ'ని అక్షరాలా పాటించే మనిషి. అయినా ప్రమోషన్ రాలేదు.

ప్రమోషన్ వచ్చిన వారి లిస్టులో తన పేరు లేదని తెలుసుకుని క్రుంగిపోయాడు రామారావు.

"వద్దు. అలా డీలా పడిపో వద్దు. జీవితం అంటే ప్రమోషన్ ఒక్కటే కాదు. ఇటు చూడండి! మన కేం లోటు ? ముత్యా ల్లాంటి పిల్ల లున్నారు. ఆర్థికంగా మరీ హీన స్థితిలో లేము. మనని అర్థం చేసుకుని ఆపేక్ష చూపే తల్లిదండ్రు లున్నారు. ప్రాణా లిచ్చే స్నేహితు లున్నారు. ఎందు కంత బాధపడిపోతా రు" అంది సుజాత.

"జీవితం అంటే ప్రమోషన్ ఒక్కటే కాకపోవచ్చు సుజాతా ! దాని వల్ల జీతంలో కూడా పెద్ద తేడా రాదు. ఇప్పటికే ప్రమోషన్ ఆలస్యం అవటం వల్ల ఇంక్రిమెంట్లు మాక్జిమమ్ రీచ్ అయ్యాయి. సంవత్సరాల తరబడి ఉద్యోగాలు చేస్తాం. ప్రమోషన్ అంటే ప్రోత్సాహం ఇచ్చినట్లే కదా! రికార్డుల్లో ఏదైనా లోపా లుంటే ఇవ్వకపోవటానికి అర్థం ఉంది. అలాంటిది నా పేరు తీసేస్తే బాధగా ఉండదా?" అన్నాడు రామారావు.

"కాలం కలిసిరానప్పుడు తా డే పామై కరుస్తుం దంటారు. ఎవరికి వారు ఆత్మ విచారం చేసుకుని తా ను చేస్తున్న పని 'సరి అయినదే' అని అనుకున్నప్పుడు, 'న్యాయం' అయినప్పుడు ఫలితా లను గురించి ఆందోళన చెంద కూడదు.

మీరు నిజాయితీగా ఉంటున్నారా, లేదా? నిజాయితీగా ఉంటున్నప్పుడు నిశ్చింతగా ఉండండి. 'ప్రమోషన్ రాలేదు కదా!' అంటారా? మొన్న మ నింటికి బంధువులు వచ్చి నప్పుడు ఏం జరిగిందో గుర్తుంది కదా? సడన్‌గా పనిమనిషికి సుస్తీ చేసింది. కరెంటు పోవటం వల్ల మోటారు పనిచెయ్యక నీళ్ళు లేవు. కుండపోతగా వర్షం. ఆదివారం అవటం వల్ల షాపులు బంద్. అయితే ఏం చేశాం? వచ్చిన అవాంతరాలకి కాసేపు విసుక్కున్నాం. మన ప్రయత్నాలు మొదలు పెట్టాం.

"పక్కింటి వాళ్ళ బావిలో నీళ్ళు తెచ్చుకున్నాం. బంధువులు పనిలో సహాయం చేశారు. కొవ్వొత్తులు వెలిగించుకుని, ఇంట్లో ఉన్న ఆధరువుతో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశాం. తప్పనిసరిగా వెళ్ళిపోవలసిన బంధువులను గొడుగులో బస్‌స్టాండ్ వరకూ తీసుకువెళ్ళి బస్ ఎక్కించాం.

"కాసేపటికి కరెంటు వచ్చింది. నీళ్ళూ వచ్చాయి. పొద్దున్నే పనిమనిషి వచ్చింది. మనకు అన్ని సదుపాయాలూ ఉన్నప్పటికి ఆ సమయంలో ఇబ్బంది పడ్డాము. బంధువుల మీద ఉన్న ప్రేమతో అవాంతరాలను పట్టించుకోకుండా సంతోషంగా గడిపాము. సంతోషంగా ఉండటం మనసుకి సంబంధించిన విషయం. పెద్ద సమస్యని చిన్నదిగా చేసుకుంటే జీవితా నికి సుఖం. ఇప్పుడు మన "టైమ్" బావుండ లేదు. అలా అని సరిపెట్టుకో నవసరం లేదు. మంచి రోజులు ఎప్పుడూ ఉంటాయి. నిజాయితీకి గుర్తింపు ఉంటుంది. మీకు 'అసోసియేషన్' ఉంటుంది కదా ! దానికి ఫిర్యాదు చేయండి" అంది సుజాత. ★